సాక్షి నిర్మల్

మంగళవారం । 10 । డిసెంబర్ । 2024

ఉద్యోగం రెగ్యులర్ కాలేదని ఆత్మహత్య..



కాంట్రాక్టు ఉద్యోగం రెగ్యులర్ కాలేదని మన స్తాపం చెందిన ఓ ఉద్యోగి ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. తన ఆత్మహత్యతో అయినా పరిస్థితి మారాలని సూసైడ్ నోట్ రాశాడు. 8లో▸

వచ్చేస్తాడు.. పట్టేస్తాడు



పాము కనిపిస్తే చాలు.. అల్లంత దూరం పారిపో తాం.. కానీ నిర్మల్‌కు చెందిన గిరిగంటి వినీల్ కుమార్ మాత్రం విష సర్పాలను సైతం అల వోకగా పట్టేస్తున్నాడు. 9లో▸

గరిష్టం/కనిష్టం

27.4 / 14.2

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగు తుంది. తెల్లవారుజామున మంచు అధికంగా కురుస్తుంది.

న్యూస్‌రీల్

108 అంబులెన్స్‌కు పూజలు



అంబులెన్స్‌కు పూజలు చేస్తున్న గ్రామస్తులు

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి ఇటీవల నూతనంగా 108 అంబులెన్స్ వాహనం మంజూరు చేసింది. డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు ప్రత్యేక చొరవతో లక్ష్మణచాంద మండలానికి అంబులెన్స్ మంజూరు చేయించారు. దీంతో సోమవారం మండల కేంద్రానికి వచ్చిన నూతన 108 వాహనానికి గ్రామంలోని వేణు గోపాలస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్, నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాసులు మాట్లాడారు. మండలానికి 108 వాహనం లేకపోవడంతో మండలంలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు సంభవించినా, ఇతర అత్యవసర సమస్యలు ఎదురైనా మామడ నుంచి 108 వాహనం కోసం ఎదురు చూడాల్సి వచ్చేదని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ప్రత్యేక చొరవతో నూతనంగా 108 అంబులెన్స్ మంజూరు అయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, తాజా మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, నాయకులు రవి, సురేశ్, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్ జిల్లాస్థాయి విజేతలకు సన్మానం



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్‌ఖిల్లా: ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన 52వ బాలల విజ్ఞాన, ఇన్‌స్పైర్ మేళాలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పట్టణంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం సోమవారం సన్మానించారు. జిల్లా కేంద్రంలోని ఈద్గాం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఆర్.సవిత, ఎస్.అంజలి, జె.నయన సైన్స్ మేళాలో పాల్గొనగా.. వీరిలో ఆర్.సవిత ప్రాజెక్టు జిల్లాస్థాయి ద్వితీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా వీరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీటీడీవో జె.అంబాజీ, ఏసీఎంవో శివాజీ, క్రీడల అధికారి రమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.తుకారాం, గైడ్ టీచర్లు జయశ్రీ, పి.శ్రీలత, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పొన్కల్ పాఠశాలలో..

మామడ: జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో విజేతలుగా నిలిచిన పొన్కల్ పాఠశాలకు చెందిన విద్యార్థులను పాఠశాలలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు సోమవారం అభినందించారు. విద్యార్థులు నేహమదులిత, నిష్కల్‌రెడ్డి, అజయ్, ఎన్‌సీసీ విద్యార్థులను అభినందించారు. జిల్లాలోనే ఎక్కువ బహుమతులను పొన్కల్ పాఠశాల విద్యార్థులు గెలుపొందడం హర్షణీయమని హెచ్‌ఎం అరవింద్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవశాస్త్ర ప్రతిభపై పోటీలు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

భైంసా: జీవశాస్త్ర ప్రతిభపై బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పోటీలు నిర్వహించారు. భైంసా పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం మండల స్థాయి పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఇంగ్లిష్ మీడియం విభాగంలో ఏ.హరిప్రియ, శ్రీజ, జెడ్పీహెచ్‌ఎస్ మాటేగాం, తెలుగు మీడియం విభాగంలో కె.విఘ్నేశ్వరి, జెడ్పీహెచ్‌ఎస్(బాలికల)భైంసా, పి.శిరీష, జెడ్పీహెచ్‌ఎస్ కామోల్, రంజిత, జెడ్పీహెచ్‌ఎస్ తిమ్మాపూర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు శ్రీనివాస్ తెలిపారు.

ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరు జిల్లా వాసులు



ఇర్ఫాన్ షేక్



చొక్కా రావు

నిర్మల్ రూరల్: ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరు జిల్లా వాసులకు చోటు లభించింది. జిల్లాకు చెందిన ఎండీ.ఇర్ఫాన్‌షేక్‌ను రాష్ట్ర కార్యదర్శిగా, శ్రీపతి చొక్కారావును ఎయిడెడ్ పాఠశాలల విభాగం రాష్ట్ర కోకన్వీనర్‌గా రాష్ట్ర నాయకత్వం నియమించినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.భూమన్నయాదవ్, జె.లక్ష్మణ్ తెలిపారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతరెడ్డి, సదానందం గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకలి.. చదువులు!



కడెం మండలం లింగాపూర్ పాఠశాలలో విద్యార్థులకు సొంత ఖర్చులతో స్నాక్స్ అందిస్తున్న ఉపాధ్యాయుడు కిషన్

- ప్రారంభమైన 'పది' ప్రత్యేక తరగతులు
- స్నాక్స్‌కు నోచుకోని విద్యార్థులు
- ఆకలితో చదువుపై దృష్టిపెట్టలేకపోతున్న వైనం..
- దాతలు ముందుకు రావాలంటున్న ప్రధానోపాధ్యాయులు

జిల్లా సమాచారం...

నిర్మల్‌లో మొత్తం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 167

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 3,820

లక్ష్మణచాంద: పదో తరగతి వార్షిక పరీక్షలకు ఇంకా మూడు నెలలే గడువు ఉంది. ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారిస్తోంది. వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుంటున్నారు. అయితే.. ఉదయం 8:30 గంటలకే స్టడీ అవర్స్ ప్రారంభం అవుతున్నాయి. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి ఉదయం 7 గంటలకే బయల్దేరుతున్నారు. ఇంట్లో వంట కాకపోవడంతో ఖాళీ కడుపుతో వస్తున్నారు. ఇక సాయంత్రం 5:30 గంటల వరకు స్పెషల్ క్లాస్ నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఇంటికి వెళ్లేసరికి 6:30 అవుతోంది. మధ్యాహ్న భోజనం మినహా వారికి ఎలాంటి అల్పాహారం అందడం లేదు. దీంతో ఆకలితో చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారు.

నిలిచిన పథకం..

గత ప్రభుత్వం 2023 దసరా సందర్భంగా పాఠశాలల్లో అల్పాహార పథకం ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇడ్లీ, ఉప్మా, పొంగల్ అల్పాహారంగా ఇచ్చేవారు. ఈ పథకాన్ని మరింతగా మెరుగుపర్చాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు భావించినా కార్యరూపందాల్చడం లేదు. పథకం ప్రారంభమైన కొన్ని రోజులకే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో అల్పాహార పథకం అటకెక్కింది. ఈనేపథ్యంలో ఉదయం ఎలాంటి అల్పాహారం అందడం లేదు. ఇక సాయంత్రం గతంలో విద్యార్థులకు దాతల సాయంతో స్నాక్స్ అందించే వారు. ప్రస్తుతం తరగతులు ప్రారంభమైనా దాతలు ఇంకా ముందుకు రాలేదు.

3,820 మంది 'పది' విద్యార్థులు..

ఈ ఏడాది జిల్లాలోని 167 ప్రభుత్వ పాఠశాలల నుంచి 3,820 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పదో తరగతి ఫలితాల్లో వరుసగా రెండేళ్లు జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ఈసారి కూడా అగ్రస్థానంలో నిలిచి హ్యాట్రిక్ కొట్టాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకు పాఠశాలకు వచ్చి సాయంత్రం 5:15 గంటల వరకు ఉంటున్నారు. మధ్యాహ్న భోజనం మినహా మధ్యలో ఎలాంటి ఆహారం తీసుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వీరందరికీ అల్పాహారంతోపాటు స్నాక్స్ అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

దాతలు ముందుకు వస్తేనే...

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ సమయంలో దాతలు ముందుకు వచ్చి తమ తోచిన విధంగా అల్పాహారం గతంలో అందజేశారు. ఈ విద్యా సంవత్సరం కూడా మండలంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు కలిగిన గ్రామాలలో ఆయా గ్రామాలకు చెందిన మనసున్న దాతలు ముందుకు వచ్చి పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం కోసం తమవంతు సాయం అందించాలని జిల్లా విద్యాధికారి రామారావు తోపాటు ఆయా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.

ఖాళీ కడుపుతోనే..



మాది లక్ష్మణచాంద మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామం. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఉదయం ఇంటి నుంచి వచ్చేటప్పుడు తినకుండానే వస్తున్నా. మధ్యాహ్న భోజన సమయంలో మాత్రమే భోజనం చేస్తున్నాం. సాయంత్రం 5:15 గంటల వరకు ఖాళీ కడుపుతోనే ప్రత్యేక స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్నా. దీంతో ఇబ్బందిగా ఉంది. – నిశిత, 10వ తరగతి

అల్పాహారం అందించాలి



మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రత్యేకంగా అల్పాహారం అందేలా చూడాలి. నిధులు మంజూరు చేయాలి. కలెక్టర్ మేడం చొరవ తీసుకోవాలి. – నిఖిల్, 10వ తరగతి, బాబాపూర్

దాతలు ముందుకురావాలి



జిల్లాలో మొత్తం 167 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. కడెం మండలం లింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వాల్గోట్ కిషన్ స్టడీ అవర్‌లో విద్యార్థులకు సొంత ఖర్చులతో అల్పాహారం అందిస్తున్నారు. ఉపాధ్యాయుడిని ఆదర్శంగా తీసుకుని దాతలు, ఉపాధ్యాయులు ముందుకు రావాలి. తోచిన విధంగా సాయం చేయాలి. – రామారావు, డీఈవో

చలిలో.. చన్నీటి స్నానాలు

- కేజీబీవీల్లో పనిచేయని సోలార్ ప్యానెళ్లు
- ప్రతిపాదనల్లోనే మరమ్మతులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు

జిల్లా సమాచారం...
జిల్లాలోని మొత్తం కేజీబీవీలు 18
మొత్తం విద్యార్థుల సంఖ్య 5,640
సోలార్ ప్యానెళ్లు పనిచేయని కేజీబీవీలు 13



స్నానానికి చన్నీళ్లనే తీసుకెళ్తున్న విద్యార్థినులు

లక్ష్మణచాంద: కొన్ని రోజులుగా జిల్లాలో చలి ప్రభావం పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కన్నా తక్కువగా నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు గజ గజ వణుకుతున్నారు. ప్రస్తుతం తుపాను ప్రభావంతో చలి కాస్త తగ్గినా.. ఈదురు గాలులు వీస్తుండడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ చలిలో కేజీబీవీల్లోని విద్యార్థులు చన్నీటితోనే స్నానాలు చేస్తున్నారు. కొంత మంది చన్నీటి కారణంగా అస్వస్థతకు గురవుతున్నారు. జ్వరం, జలుబుతో ఇబ్బంది పడుతున్నారు.

పనిచేయని సోలార్ ప్యానెళ్లు..

జిల్లాలో మొత్తం 18 కేజీబీవీ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. ఇందులో ఐదు పాఠశాలల్లోనే సోలార్ ప్యానెళ్లు పనిచేస్తున్నాయి. ఆ పాఠశాలల విద్యార్థులు వేడినీటితో స్నానం చేస్తున్నారు. మిగతా 13 పాఠశాలల్లో సోలార్ ప్యానెళ్లు పనిచేయకపోవడంతో చలికాలంలోనూ విద్యార్థులకు చన్నీటి స్నానం తప్పడం లేదు. 2018లో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెళ్లు కొద్ది రోజులు మాత్రమే పనిచేశాయి. నాలుగేళ్లుగా అవి పనిచేయడం లేదు. దీంతో ఏటా చలికాలంలో విద్యార్థినులు ఇబ్బంది పడున్నారు.

పట్టించుకోని ప్రభుత్వాలు...

విద్యార్థులకు అన్నిరకాల వసతులు సమకూరుస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలు ఆచరణలో మాత్రం పాటించడం లేదు. 2019 నుంచి జిల్లాలోని 13 కేజీబీవీ పాఠశాలల్లో సోలార్ ప్యానెళ్లు పనిచేయడం లేదు. దీనిపై ఆయా పాఠశాలల స్పెషల్ ఆఫీసర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ప్రభుత్వాలు మరమ్మతుకు చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా.. విద్యార్థుల ఇబ్బందులు మాత్రం తొలగడం లేదు.

స్నానాలకు దూరం..

చలి కారణంగా ఉదయం చన్నీటి స్నానం చేయడానికి విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో సగానికిపైగా విద్యార్థులు ఉదయం స్నానం చేయడం లేదు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్నానాలు చేస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోతే వ్యాధులు ముసురుకునే ప్రమాదం ఉంది. బాలికల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కేజీబీవీల్లో వేడినీరు అందేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది..



అసలే చలికాలం.. చలి తీవ్రత మరీ ఎక్కువగా ఉంది. ఇంత చలిలో చన్నీటితో స్నానం చేయడం చాలా ఇబ్బందిగా ఉంది. సమస్యను సార్ల దృష్టికి తీసుకెళ్లాం. మా ఇబ్బందులను ఎవరూ పట్టించుకోవడం లేదు. – సాత్విక, లక్ష్మణచాంద కేజీబీవీ

రెండు, మూడు రోజులకోసారి..



చల్లటి నీళ్లతో స్నానం చేయడం చాలా ఇబ్బందిగా ఉంది. ఉదయం స్నానం ఇబ్బందికరంగా మారడంతో రెండు లేదా మూడు రోజులకు ఒక సారి స్నానం చేస్తున్నాం. చల్లటి నీటితో స్నానం చేస్తే జలుబు, జ్వరం వస్తున్నాయి. – అవంతిక, లక్ష్మణచాంద కేజీబీవీ

ప్రతిపాదనలు పంపించాం..



జిల్లాలోని 13 కేజీబీవీ బాలికల పాఠశాలల్లో సోలార్ ప్యానెళ్లు పని చేయడంలేదని ఇదివరకే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వాటి మరమ్మతుకు అవసరమైన నిధుల కోసం రెండు రోజుల్లో ప్రతిపాదనలు పంపుతాం. నిధులు రాగానే మరమ్మత్తులు చేయిస్తాం. – సలోమి కరుణ కేజీబీవీ సెక్టోరియల్ అధికారి

ప్రజాసమస్యలు తక్షణం పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. విద్య, వైద్యం, ధరణి, పింఛన్లు, రెవెన్యూ, వ్యవసాయం తదితర సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా వచ్చిన ప్రతీ ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, ప్రాధాన్యక్రమంలో పరిశీలించాలన్నారు. నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుదారులకూ పరిష్కార అంశాల సమాచారం అందించాలన్నారు. అనంతరం శాఖల వారీగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార పురోగతిని సమీక్షించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా వాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల ముందుకు మురుగు నీరు..

మేము నిర్మల్ మున్సిపాలిటీ 12వ వార్డు శాంతి నగర్ కాలనీలోని ఈఎస్‌ఐ ఆసుపత్రి, చర్చి రోడ్డులో నివాసం ఉంటున్నాం. కొంతమంది వ్యక్తులు తమ గృహ సముదాయాలలో డ్రైనేజీ వెళ్లకుండా అడ్డంగా మట్టి కుప్పలు వేశారు. ప్రశ్నిస్తే ఎదురుదాడి చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురికి నీరు రోడ్లపై పారుతుంది. దోమలు వృద్ధి చెంది కాలనీ వాసులము జ్వరాల బారిన పడుతున్నారు.

అక్రమ వెంచర్లు తొలగించాలి..

గత ప్రభుత్వం 2008లో సర్వే నెంబర్ 558/ఉ లోని ప్లాట్లను న్యూ అగ్రకాలోని వారికి ఇచ్చారు. మిగులుబాటు భూమి ధరణిలో ప్రవేటు భూమిగా నమోదు చేశారు. దీంతో కొందరు వ్యక్తులు వెంచర్‌గా చేసి ప్లాట్లను రిజిస్ట్రేషన్ లేకుండా సాదాబైనామాపై అమ్ముతున్నారు. ఈ భూమిని అగ్రకాలనీ వాసుల కోసం కేటాయించి మినీ ఫంక్షన్ హాల్, పార్క్, లైబ్రరీ, రెసిడెన్షియల్ స్కూల్, కమిటీ హాల్ వంటివి నిర్మించాలి.

రుణాలు మాఫీ చేయాలి

మేము వాల్గేగం గ్రామానికి చెందిన రైతులం. భార్య పేరు మీద రూ.2 లక్షలు, భర్త పేరు మీద రూ.2 లక్షల రుణం తీసుకున్న వారు మా గ్రామంలో దాదాపు 150 మంది ఉన్నారు. మాకు నేటికీ రుణమాఫీ కాలేదు. గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా అందరికీ రుణమాఫీ చేయాలి.

పరిహారం అందించాలి..



పట్టణ అభివృద్ధిలో భాగంగా చైన్‌గేట్ నుంచి బంగల్‌పేట వరకు రోడ్డు విస్తరణలో మా ఇల్లు కోల్పోయాము. అప్పుడు అధికారులు మాకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇస్తామని మాట ఇచ్చారు. ఇప్పటివరకు పరిహారం చెల్లించకపోగా, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా మంజూరు చేయలేదు. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. – వెంకటమ్మ, గాంధీచౌక్

కొత్త రుణం ఇవ్వడం లేదు..



నాకు పొనకల్ గ్రామంలో 314/1 లో 19 గుంటలు 408/ఆ/1లో ఆరు గుంటల భూమి ఉంది. 2022 నుంచి అధికారుల చుట్టూ తిరిగిన ధరణిలో నా పేరు కనిపించడం లేదు. దీనికి తోడు గత ప్రభుత్వంలో నేను తీసుకున్న రుణం మాఫీ అయింది. ప్రస్తుతం నేను రుణం తీసుకుందాం అంటే బ్యాంక్ అధికారులు ఇందుకు సంబంధించిన డాటా ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని చెబుతున్నారు. – రవి, పొన్కల్

'సమగ్ర' ఉద్యోగుల సమ్మెబాట

- మూడు రోజులపాటు రిలే దీక్షలు
- ప్రభుత్వం నుంచి స్పందన కరువు
- నేటి నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధం



అదనపు కలెక్టర్‌కు నోటీస్ ఇస్తున్న ఉద్యోగులు

మంచిర్యాలఅర్బన్/కెరమెరి(ఆసిఫాబాద్): విద్యాశాఖలో కీలకంగా వ్యవహరిస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని డిమాండ్‌చేస్తూ ఆందోళన బాటపట్టారు. ఈ నెల 6 నుంచి జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. ఎమ్మార్సీ, సీఆర్‌సీ స్థాయిల్లో పనులకు అటంకం ఏర్పడనుంది. అలాగే కేజీబీవీలు, యూఆర్‌ఎస్‌ల ఉద్యోగులు కూడా సమ్మెలో పాల్గొననున్నారు.

క్రమబద్ధీకరణ కోసం..

సమగ్ర శిక్షా పరిధిలో క్లస్టర్ స్థాయి, జిల్లా స్థాయితోపాటు కేజీబీవీ, యూఆర్‌ఎస్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19వేల మంది కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 2017 మంది సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. పదేళ్లకు పైగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేక ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని, అప్పటివరకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వివిధస్థాయిల్లో వినతులు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడంతో రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 6 నుంచి మూడు రోజులపాటు రిలే దీక్షలు చేపట్టారు.

ఉద్యోగుల వివరాలు

జిల్లా	ఉద్యోగులు
ఆదిలాబాద్	607
మంచిర్యాల	513
కుమురంభీం	473
నిర్మల్	424

సేవలకు ఆటంకం

సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం నుంచి సమ్మె చేపడుతుండటంతో విద్యాశాఖలో పలు సేవలు నిలిచిపోనున్నాయి. డీపీవో స్టాఫ్, అకౌంటెంట్స్, ఏఎస్‌ఎం, సీఆర్‌టీ, పీజీ సీఆర్‌టీ, స్పెషల్ ఆఫీసర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్‌పీ, ఎంఐఎస్‌సీసీవో, పార్ట్‌టైం టీచర్లుగా వీరు విధులు నిర్వహిస్తున్నారు. కేజీబీవీ, యూఆర్‌ఎస్, భవిత కేంద్రాల్లో బోధన నిలిచి విద్యార్థుల చదువుపై ప్రభావం పడనుంది. డీఈవో, ఎంఈవో కార్యాలయాలు, వృత్తి విద్యా ఇన్‌స్ట్రక్టర్లు విధులకు దూరంగా ఉండనుండటంతో ఆన్‌లైన్ పనులు నిలిచిపోనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల్లో సమగ్ర శిక్షా ఉద్యోగులు ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే సమ్మె నోటీసులు అందించారు.

ఓడినవారికి నిధులెలా ఇస్తారు?

- అసెంబ్లీలో ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్..



అసెంబ్లీలో మాట్లాడుతున్న రామారావు పటేల్

భైంసాటౌన్: నియోజకవర్గాల్లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని, ఇది ప్రజాతీర్పుతో గెలిచిన ఎమ్మెల్యేలను అవమానించడమేనని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో భాగంగా సభలో ఆయన తన వాణి వినిపించారు. ముందుగా అసెంబ్లీ ఆవరణలో తెలంగాణతల్లి విగ్రహ ఏర్పాటుపై ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ చిన్నమ్మగా పిలుచుకునే స్వర్గీయ సుష్మాస్వరాజ్ పాత్ర కీలకమని, తెలంగాణ ఏర్పాటులో ఆమె పాత్రను విస్మరించడం సరికాదన్నారు. ఏ ఒక్కరి కారణంగా తెలంగాణ రాలేదని, ఎంతోమంది ఆత్మబలిదానాలతోనే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని పేర్కొన్నారు. నియోజకవర్గాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు ప్రొటోకాల్ సమస్య ఎదుర్కొంటున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. ప్రజాతీర్పును గౌరవించాలని స్పీకర్ ద్వారా ప్రభుత్వానికి సూచించారు. అంతకు ముందు అసెంబ్లీ సమావేశాలకు బీజేపీ ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్‌బాబు, పాయల్ శంకర్‌తో కలిసి ట్రాక్టర్‌పై వెళ్లారు.

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్యాయత్నం

నర్సాపూర్(జి): భర్త వేధింపులు తాళలేక చెరువులో దూకి మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు...మండల కేంద్రానికి చెందిన పందిరి మమత, సాయన్న భార్యాభర్తలు. భర్త పెడుతున్న వేధింపులతో మనస్తాపానికి గురైన మమత సోమవారం స్థానిక బసం చెరువులో దూకింది. గమనించిన స్థానికులు పోలీస్ కానిస్టేబుల్ చౌహాన్ కృష్ణకు సమాచారం అందించగా స్థానికుల సాయంతో మహిళను బయటకు తీశారు. ప్రాథమిక చికిత్స అందించి 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మహిళ సోదరుడు గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం



మంటలు ఆర్పుతున్న స్థానికులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్‌కు చెందిన పొచ్చన్న ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి సోమవారం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధిత కుటుంబ సభ్యులు పంట చేనుకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. దాదాపు 20 క్వింటాళ్ల పత్తి నిల్వ ఉండగా, గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. అప్పటికే సగం వరకు పత్తి కాలిబూడిదైంది. దీంతో బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

తండ్రిని చంపిన తనయుడు



ముత్యం మృతదేహం

నిర్మల్‌రూరల్: తనయుడి చేతిలో తండ్రి హతమైన సంఘటన మండలంలోని ముతాపూర్‌లో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల మేరకు మండలంలోని ముతాపూర్‌కు చెందిన గుర్రం ముత్యం (47) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆదివారం రాత్రి బంధువుల ఇంట్లో జరిగిన విందుకు హాజరై ఇంటికి వచ్చాడు. తన తల్లి వెంకటమ్మను డబ్బులు ఇవ్వమని కొట్టాడు. గమనించిన అతని పెద్ద కుమారుడు మణిదీప్ నానమ్మను ఎందుకు కొడుతున్నావ్ అంటూ చీరతో గొంతు నులిమి హత్య చేశాడు. గాయపడిన వెంకటమ్మను అదేరాత్రి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి తనతండ్రి గుండెనొప్పితో మృతి చెందాడని గ్రామస్తులను నమ్మించాడు. అనుమానం వచ్చిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై లింబాద్రి తమదైన శైలిలో విచారించగా నిజాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



ఆగని దారి దోపిడీ!

- వాంకిడి చెక్‌పోస్టు వద్ద అక్రమ వసూళ్లు
- 'ఆర్టీఏ' తనిఖీల మాటున రూ.లక్షల్లో ఆర్జన
- ప్రైవేటు సిబ్బందితోనే యథేచ్ఛగా దందా
- అంతర్రాష్ట్ర సరిహద్దు కేంద్రంగా అవినీతి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తెలంగాణ, మహారాష్ట్ర అంతర్రాష్ట్ర సరిహద్దు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆర్టీఏ చెక్‌పోస్టులో అక్రమ వసూళ్ల పర్వం ఆగడం లేదు. ఈ చెక్‌పోస్టులో వాహనాల తనిఖీల సమయంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. వ్యవస్థీకృతంగా మారిన ఈ దారి దోపిడీతో రోజుకు రూ.లక్షల్లో జేబులు నింపుకుంటున్నారు. రవాణా శాఖ చెక్‌పోస్టు కేంద్రంగా అధికారులు అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

పోస్టింగ్‌కు పోటాపోటీ

ఒక రోజు డ్యూటీ చేస్తే రూ.లక్షలు ఇంటికి తీసుకువెళ్లే చెక్‌పోస్టు విధుల కోసం అధికారులు, సిబ్బంది అమితాసక్తి చూపిస్తారు. ప్రస్తుతం ఏడుగురు రవాణా శాఖ అధికారులు ఉన్నారు. నలుగురు ఎంవీఐ(మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్) కాగా, మరో ముగ్గురు ఏఎంవీఐ(అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్) ఉన్నారు. గతంలో ఆన్‌డ్యూటీ(ఓడీ)లు, రెగ్యులర్ విధులతో చెక్‌పోస్టుల్లోనూ పని చేశారు. ప్రభుత్వం ఓడీలు రద్దు చేసింది. దీంతో ఏడుగురు అధికారులే రోజుకు ఒకరు చొప్పున విధుల్లో ఉంటున్నారు. వీరికి ఓ కానిస్టేబుల్, ఆఫీస్ సబార్డినేట్, మరో పది నుంచి 20మంది వరకు ప్రైవేటు వ్యక్తులు పని చేస్తున్నారు. అధికారులు వాహనాల అనుమతి, లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్, పన్నులు, ఓవర్‌లోడ్ తదితరవన్నీ చెక్ చేసి పంపించాలి. ఏవైనా లేకుంటే నిబంధనల మేరకు జరిమానాలు వేయాలి. కానీ తనిఖీ చేశాక పర్మిట్ ఇచ్చేందుకు వాహన టైర్లను బట్టి వసూలు చేస్తున్నారు.

రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.3లక్షలు

హైదరాబాద్, విజయవాడ, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి మంచిర్యాల మీదుగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి దాటి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బీహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు జాతీయ రహదారి 363పై నుంచి వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నాగ్‌పూర్, విజయవాడ, తెలంగాణతోపాటు ఏపీ, చెన్నయ్ వరకు వెళ్తుంటాయి. ఒక్కో బండి నుంచి రూ.500 నుంచి రూ.600వరకు వసూలు చేస్తున్నారు. రోజూ వందలాది వాహనదారుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్న సొమ్ము రూ.2లక్షల నుంచి రూ.3లక్షల దాకా ఉంటోంది. నెలకు అరకోటి పైనే. రద్దీ వేళల్లో ఇంకా అదనంగానే ఉంటోంది.

డబ్బాలో డబ్బులు వేయిస్తూ..

ప్రైవేటు సిబ్బంది చేతులు, కర్రలు, రాత్రి వేళ స్టిక్కర్లు ఉన్న కర్రలను రోడ్డుపై చూపుతూ అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద వాహనాలు నిలిపివేస్తుంటారు. డ్యూటీలో ఉన్న అధికారి పత్రాల పరిశీలన చేస్తుంటారు. అయితే అక్కడితో ఆగకుండా చెక్‌పోస్టు లోపల ఓ డబ్బాను ఏర్పాటు చేశారు. ఎవరి చేతికి ఇవ్వకుండా అందులో డబ్బులు వేయిస్తుంటారు. ఆ డబ్బాను గమనిస్తూ పోగైన డబ్బులను తీసుకుంటూ ఖాళీ చేస్తుంటారు. ఈ డబ్బు నుంచి రోజువారీగా ప్రైవేటు వ్యక్తుల కూలి, భోజనాలు, ఖర్చులు పోను మిగిలినవి పంచేసుకుంటున్నారు. వాహనదారుల నుంచి కూరగాయలు, గుడ్లు, బాయిలర్ కోళ్లు, పండ్లు తీసుకుంటున్నారు.

అడిగినంత ఇస్తున్నం



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి చెన్నయ్ వెళ్తున్న. ప్రతీసారి చెక్‌పోస్టు వద్ద నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇవ్వకుంటే ఇబ్బందులకు గురి చేస్తారనే భయంతో అడిగినంత ఇస్తున్నం.

– మనోజ్ గుప్తా, డ్రైవర్

రూ.500 తీసుకుంటున్నారు



నెలకు నాలుగైదు సార్లు మధ్యప్రదేశ్ నుంచి విజయవాడకు ఈ చెక్‌పోస్టు గుండా వెళ్తుంటాం. ప్రతీసారి రూ.500తీసుకుంటున్నారు. డబ్బులు ఎందుకని అడిగితే ఏం చెప్పరు.

– వెంకటేశం, డ్రైవర్

అందరికీ మామూళ్లే..

వాంకిడి చెక్‌పోస్టులో యథేచ్ఛగా దారిదోపిడీ సాగుతున్నా ఎవరూ అడ్డు చెప్పరు. ఇందుకు అధికారులు పెద్దయెత్తున పంపకాలు చేస్తుంటారు. ఇందులో అన్ని రంగాల వారు ఉన్నారు. ప్రజాప్రతినిధుల నుంచి మొదలు ఎన్నికల్లో ఓడిపోయిన నాయకుల దాకా డబ్బులు అందుతుంటాయి. జిల్లా, ఉమ్మడి జిల్లాలో ఆ వ్యక్తిని బట్టి కనీసం రూ.5వేల నుంచి లక్ష దాకా మామూళ్లు ఇస్తున్నట్లు సమాచారం. దీంతో అందరూ కళ్లు మూసుకున్నట్లుగా ఉంటున్నారు. ఈ అక్రమ దందాపై ఏసీబీ, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

మంచిర్యాలలోనే స్పీడ్ పోస్ట్ సేవలు

- ఆర్‌ఎంఎస్ కార్యాలయం జిల్లా కేంద్రంలోనే కొనసాగేలా ఉత్తర్వులు

సాక్షి ఎఫెక్ట్..

పాతమంచిర్యాల: స్పీడ్‌పోస్ట్ సేవలు, ఉత్తరాల బట్వాడా ఇకనుంచి మంచిర్యాల నుంచే జరుగనున్నాయి. డిసెంబర్ నెలాఖరు నుంచి ఉత్తరాలు, పార్శిళ్లు త్వరగా గమ్యస్థానాలకు చేరే అవకాశం ఉంది. 2016 వరకు జిల్లా కేంద్రంలోనే కొనసాగిన స్పీడ్ పోస్టాఫీస్ (ఇంట్రా సర్కిల్ హబ్)ను అధికారులు వరంగల్‌కు తరలించారు. దీంతో ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో ఒక్కరోజులోనే అందాల్సిన ఉత్తరాలు మూడు నుంచి నాలుగు రోజులు ఆలస్యంగా అందేవి. కొన్నిసార్లు పోస్టల్ బ్యాలెట్లు కూడా లెక్కింపు సమయానికి కేంద్రాలకు అందని సంఘటనలు ఉన్నాయి. తాజాగా జిల్లాలో ఆర్‌ఎంఎస్ సేవలను కూడా ఇక్కడి నుంచి వరంగల్‌కు తరలించాలని తపాలాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. విషయాన్ని ముందే గ్రహించిన 'సాక్షి' నవంబర్ 08న 'డిస్ట్రిబ్యూషన్ తరలింపు' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. దీంతో ప్రజాప్రతినిధులు స్పందించారు. తపాలాశాఖ ఉన్నతాధికారులు సైతం జిల్లా అధికారులతో సంప్రదింపులు జరిపి కార్యాలయం తరలింపుపై అభిప్రాయాలు సేకరించారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తపాలాశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అంతేకాకుండా ఆర్‌ఎంఎస్ కార్యాలయం, స్పీడ్ పోస్టాఫీస్‌ను జిల్లా కేంద్రంలో కొనసాగించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ నవంబర్ 23న కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాధిత్య సింధియాకు విన్నవించారు. దీనిపై తపాలాశాఖ ఉన్నతాధికారులు పునరాలోచన చేశారు. రెండు కార్యాలయాలు ఇక్కడి నుంచే కొనసాగించాలని డిసెంబర్ 5న కేంద్ర కమ్యూనికేషన్‌ల మంత్రిత్వశాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ (మెయిల్ ఆపరేషన్స్) హరిఓం శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. సాక్షి కథనంతోనే ఆర్‌ఎంఎస్ కార్యాలయం జిల్లా నుంచి తరలిపోకుండా నిలిచిందని ఈ సందర్భంగా ఉద్యోగులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగం రెగ్యులర్ కాలేదని ఆత్మహత్య..

- 510 జీవోతో అన్యాయం జరిగిందని ఆవేదన..
- తన చావుతో అయినా మిగతా వారికి న్యాయం జరగాలని సూసైడ్ నోట్



భరత్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో ఆరేళ్లుగా పనిచేస్తున్న ఓ ఉద్యోగి.. తనకన్నా జూనియర్లు రెగ్యులర్ అయ్యారని, తనకు మాత్రం అన్యాయం జరిగిందని మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్ రాశాడు. ఈ ఘటన నిర్మల్ జిల్లాలో సోమవారం సాయంత్రం జరిగింది. జిల్లా కేంద్రానికి చెందిన వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగి వకులాభరణం భరత్ కుమార్ (37) ఇంట్లో ఉరేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు భరత్ రాసిన ఓ సూసైడ్ లేఖ అందరినీ కంటతడి పెట్టిస్తోంది.'మా అమ్మానాన్నల కడుపులో పుట్టడం నా అదృష్టం. ఎంతో పెద్ద ఉద్యోగం వస్తుందని కలలు కన్నాను. 2018 లో ఆరోగ్యశాఖలో ఆర్‌ఎన్టీసీపీ విభాగంలో సీనియర్ ట్రీట్మెంట్ ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగం పొందాను. జీవితంలో స్థిరపడతానని ఆశించాను. కానీ నాకన్నా హోదా తక్కువ ఉన్న వారికి ఇదే శాఖలో జీతం ఎక్కువగా రావడం.. నా జీతం మాత్రం పెరగకుండా కాంట్రాక్ట్ పద్ధతిలోనే ఉండిపోవడంతో తీవ్రంగా నిరాశ చెందాను. నాతోపాటు నాలాంటి వాళ్లను రెగ్యులర్ చేసే విషయంలో జీవో 510 అన్యాయం చేసింది. అప్పటి ప్రభుత్వంలో వచ్చిన ఈ జీవో వల్ల నష్టపోయాం. ఇటీవల జీవో 16 కూడా అమలు చేయవద్దని ఉత్తర్వులు వచ్చాయి. దీంతో మాకు తీరని అన్యాయం జరిగింది. ఉద్యోగం రెగ్యులర్ అవుతుందని ఎంతో ఆశతో ఎదురుచూశా. కానీ అది జరగక పోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యా. నా భార్య పల్లవికి అన్యాయం చేస్తున్నా. కుమారుడు దేవాను వీడిపోతున్నా. మీ ఇద్దరినీ బాగా చూసుకుంటానని కలలు కన్నా. కానీ ఉద్యోగం రెగ్యులర్ కాకపోవడంతో మీకు చెప్పినట్లుగా ముందుకు వెళ్లలేకపోయా. ఇంతకాలం పనిచేసిన కాలంలో నాకు రావాల్సిన పీఆర్‌ఎల్ బకాయిలు నా భార్యకు ఇవ్వండి. నా ఆత్మహత్యతో అయినా మిగతా వారికి న్యాయం జరగాలి. ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయిలో తెలిసేలా చూడండి. సహచర ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అందరికీ రుణపడి ఉంటా. అమ్మా నాన్న సారీ..' అంటూ సూసైడ్ నోట్ రాశాడు. భరత్ మృతి ఆరోగ్య శాఖ ఉద్యోగుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

- ఆదివాసీ అస్తిత్వ పోరు గర్జన సభలో ఆదివాసీ పెద్దలు

హక్కుల సాధనకు పోరాడుదాం



సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు



అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకు సమన్వయంతో పోరాడుదామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) రాష్ట్ర నాయకులు, ఆదివాసీ పెద్దలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అమరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసీల న్యాయమైన హక్కులు, సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించని పక్షంలో ఏప్రిల్ 10 తర్వాత ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం నుంచే మరో ఉద్యమం ప్రారంభిస్తామన్నారు. చట్టబద్ధత లేని లంబాడీల ఎస్టీ హోదా రద్దు చేయాలని, జైనూర్ మండల కేంద్రంలో 1970 తరువాత వలస వచ్చిన మైనార్టీలను వెంటనే తరలించాలని, ఆదివాసీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, 5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచ్చయ్య, రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేశ్, గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు దాదిరావ్, కోశాధికారి కొట్నాక్ బారిక్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు



గంజాయి చూపిస్తున్న సీఐ సునీల్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఎరోడ్రమ్ సమీపంలో సోమవారం గంజాయి విక్రయించేందుకు వెళ్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.ఆదిలాబాద్ రూరల్ మండలంలోని దారులొద్దికి చెందిన గేడం సురేష్, సిడాం సురేష్, బేల మండలంలోని గర్కగూడెంకు చెందిన మేస్రం శ్రీహరి 3.800 కిలోల గంజాయిని పట్టణంలో విక్రయించేందుకు బైక్‌పై వెళ్తుండగా పక్కా సమాచారం మేరకు కాపు కాసి వారిని పట్టుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో వన్‌టౌన్ ఎస్సైలు అశోక్, ఇసాక్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురు..



నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ అఫ్జలుద్దీన్

బెల్లంపల్లి: బెల్లంపల్లి కోల్ కెమికల్ ఏరియా ప్రాంతంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఓ యువకుడిపై హత్యాహత్నానికి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. సోమవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ డబ్బుల విషయంలో ఆశా సంతోష్‌కుమార్‌పై గొర్ల అఖిల్, కామెర రాజు, గడ్డం మదన్‌కుమార్ కత్తి, బీరు సీసాలతో పాడవడంతో తీవ్రగాయాలయ్యాయి. సంతోష్‌కుమార్ తల్లి మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో టూటౌన్ ఎస్సై రంగు తిరుపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నలుగురు..

బేల: మండలంలోని డోప్టాలలో ఈ నెల 8న కుంచల విశాల్ ఇంట్లో జరిగిన చోరీ కేసులో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుంచల్వార్ అభినవ్, బుసే బడిరాం చోరీకి పాల్పడినట్లు గుర్తించామన్నారు. నిందితుల వద్ద నుంచి 3 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు, రూ.14,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో ఎస్సై దివ్యభారతి, ఏఎస్సై కనక జీవన్‌కుమార్, సిబ్బంది ప్రభాకర్, రాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

మంచిర్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఈ నెల 8న జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేదరీవాడకు చెందిన మిట్టపల్లి వీరాస్వామి కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన తీగల భాగ్యతో మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. ఈ నెల 8న మద్యం మత్తులో భాగ్యతో గొడవపడి బండరాయితో తలమీద బాదడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి సోదరి సంపతి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

గొలుసు అపహరణ



బాధితురాలు లక్ష్మి

భైంసాటౌన్: ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించిన ఘటన సోమవారం పట్టణంలోని బస్టాండ్‌లో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. కుభీర్‌కు చెందిన లింగంపల్లి లక్ష్మి(60) భైంసా బస్టాండ్‌లో కుభీర్ బస్సు ఎక్కుతుండగా, గుర్తు తెలియని దుండగుడు గొలుసు (తులం నర) దొంగిలించాడు. కొద్దిసేపటికి మెడలో గొలుసు లేకపోవడాన్ని గమనించిన వృద్ధురాలు లబోదిబోమంది. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గాదిగూడ మండలం శివన్నారా గ్రామానికి చెందిన రాజు అంగన్‌వాడీ సెంటర్, సీసీరోడ్డు మంజూరు చేయించాలని, బేల మండలం గణేశ్‌పూర్ గ్రామానికి చెందిన మడావి లస్మా ఎడ్ల జత ఇప్పించాలని, సిర్పూర్(యూ) మండలం మెట్టిగూడకు చెందిన పెందూర్ భువనేశ్వర్ ఇందిరమ్మ ఇల్లు, భీమిని మండలం కర్జిభీంపూర్ గ్రామానికి చెందిన టేకం పోషన్న బోర్‌వెల్ మంజూరు చేయాలని కోరారు. ఇంకా వివిధ సమస్యలపై ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్ రావు, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు

నేరడిగొండ: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో నేరడిగొండ కేజీబీవీ విద్యార్థినులు ఆరుగురు కాంస్య పతకాలు సాధించినట్లు ప్రత్యేక అధికారి రజిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు ఆర్.శ్రీలేఖ డి.శిరీష జె.అనిత, టి.శిరీష, ఎం.శ్రీనిత్య బి.వనితను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ స్నేహ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

11న క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న అండర్–14 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ కోదాటి ప్రదీప్, కోచ్. ప్రదీప్ తెలిపారు. క్రీడాకారులు మంచిర్యాల పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలోని క్రికెట్ నెట్‌లో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. 1 సెప్టెంబర్ 2010 తర్వాత పుట్టినవారు పోటీలకు అర్హులని, మరిన్ని వివరాలకు 9440010696 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినులు సింధుజ, అంజలి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రోజారాణి తెలిపారు. ఈ నెల 7 నుంచి 11 వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న 71వ సీనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె పేర్కొన్నారు.